www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 4 మే 2023
5
ఏలూరు

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి
సిపిఎం, రైతు సంఘం నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - పెదపాడు

అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వట్లూరులో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం సకాలంలో కొనుగోలు చేయకపోవడం వల్ల అకాల వర్షాలకు తడిసిన రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తడిసిన ధాన్యం కొనుగోలుకు అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన కౌలు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పిచ్చుక ఆదిశేషు, జె.గోపి, రైతు సంఘం మండల కన్వీనర్ చందు, సత్తిబాబు, పి.ఏడుకొండలు, పాల్గొన్నారు.

ఏలూరులో..

పెల్లుబికిన ఉక్కు పోరు

జిల్లా వ్యాప్తంగా నిరసనల హోరు - కార్మిక, ప్రజాసంఘాలు, వామపక్షాల ఆధ్వర్యాన రాస్తారోకోలు, ధర్నాలు, ప్రదర్శనలు

ప్రజాశక్తి - విలేకరులు

విశాఖలో సుమారు 811 రోజులుగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా ట్రేడ్ యూనియన్లు, వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లాలో బుధవారం పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా మండల కేంద్రాల్లోని ప్రధాన రహదారులపై రాస్తారోకోలు చేశారు. పలుచోట్ల ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేపట్టారు. విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాలని కోరుతూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

ఏలూరు అర్బన్: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరణ చేయడాన్ని కోరుతూ స్థానిక వసంత మహల్ సెంటర్‌లో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్, రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిలిచిపోయింది. సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, ఎఐటియుసి ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేనలు కేంద్రంపై పోరాడాలని వారు డిమాండ్ చేశారు. పరిశ్రమకు అవసరమైన ఐరన్ గనులను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రయివేటీకరిస్తే ఎంతోమంది ఉపాధి కోల్పోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, పి.రామకృష్ణ, ఎ.శ్యామలారాణి, నాయకులు పి.ఆదిశేషు, సిఐటియు జిల్లా నాయకులు కొర్ని విజయలక్ష్మి, నగర అధ్యక్షులు బి జగన్నాధరావు, సిపిఐ నాయకులు ఉప్పులూరి హేమశంకర్, పుప్పాల కన్నబాబు, ప్రసాద్, కడుపు కన్నయ్య, ఎఐటియుసి నాయకులు రెడ్డి శ్రీనివాస్‌డాంగే, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు బద్దా వెంకట్రావు, ఐఎఫ్‌టియు నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, బాలాజీ, గురుమూర్తి ఈశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు ఉక్కు మురళీకృష్ణ, చంద్రశేఖర్, చంద్రకాంతమ్మ, డిసిఐ సుబ్బారావు, సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : స్థానిక మెయిన్ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు సత్తు కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చాకలి శివనాగరాజు, షేక్ జహంగీర్ బాషా, జలసూత్రం గోపాలరావు, బండి కోటేశ్వరరావు, నెరవరపు ఊశయ్య, వలువురు కార్మికులు పాల్గొన్నారు.

కుక్కునూరులో..

జంగారెడ్డిగూడెం: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా బిజెపి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని సిఐటియు, ఎఐటియుసి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సిఐటియు, ఎఐటియుసి, ఇతర కార్మిక, ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పసల సూర్యారావు బస్టాండ్ ఆవరణ మార్కెట్ యార్డ్ బైపాస్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు టౌన్ కార్యదర్శి షేక్ సుభాషిణి, సిపిఎం మండల కార్యదర్శి జెవి.రమణరావు, సిపిఎం మండల కార్యదర్శి మానుకొండ జీవరత్నం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల గోడు పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తోందన్నారు. దేశానికే గుండెకాయ వంటి విశాఖ ఉక్కును ప్రయివేటీకరించడం దారుణమన్నారు. ఎందరో ప్రాణత్యాగాలు చేసి, పిల్లల భవిష్యత్తుకు, ఎంతోమందికి ఉద్యోగాలు లభిస్తాయని ముందుచూపుతో చిన్నచిన్న రైతులు కూడా తమ భూమిని స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి త్యాగం చేశారని తెలిపారు. బిజెపి అడుగులకు మడుగులొత్తుతున్న వైసిపి, టిడిపి, జనసేనల వైఖరి మారాలన్నారు. ఈ కార్యక్రమంలో చల్లారి మాణిక్యాలరావు, డివైఎఫ్ఐ నాయకులు జి.సూర్యకిరణ్, వెంకటరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు బి.యశ్వంత్, రైతు సంఘం నాయకులు బి.రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్, సిపిఐ నాయకులు సిహెచ్.శ్రీను, సంకర రాధాకృష్ణ, ఎఐటియుసి నాయకులు కొత్తూరి నాగేశ్వరరావు, విమలేష్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

భీమడోలులో..

బుట్టాయగూడెం : విశాఖ ఉక్కును పరిరక్షించాలని కోరుతూ స్థానిక ప్రధాన రహదారిపై కార్మిక, ప్రజాసంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు కారం రాఘవులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, సిపిఎం మండల కార్యదర్శివర్గసభ్యులు పోలోజు నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు కారం భాస్కర్, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ స్థానిక సెంటర్‌లో సిఐటియు, ఎఐటియుసి, సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో కార్మికులు, నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుక్కబోయిన రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి జమ్ము శ్రీను, నాయకులు రామన్న, చెరుకూరి మరిడియ, రాచూరి నాగేశ్వరరావు, దుర్గారావు, పిల్లా తమ్మారావు, గోపి, కడియం సీతారాముడు, ముప్పిడి సురేష్, ఎస్‌కె.బాజీ, నరసయ్య, బుచ్చిరాజు పాల్గొన్నారు.

వేలేరుపాడు : విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ధర్మల రమేష్, మడివి దుర్గారావు, కె.వెంకట్రావు, ఎంఎల్ ప్రజాపంథా నాయకులు ఎస్‌కె.గౌస్, ఎస్.రామారావు, సిపిఐ నాయకులు ఎమ్‌డి.మునీర్, రాము, సాయిబాబా, టిడిపి నాయకులు ఎ.అశోక్ పాల్గొన్నారు.

కుక్కునూరు : విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తిరుపతిరావు, శివ, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, రాంబాబు పాల్గొన్నారు.

నేతల నిర్బంధం

నిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, విశాఖ ఉక్కు అమ్మకం ఆపేంతవరకూ పోరాటాలు చేస్తామని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ అన్నారు. ఈ సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా నాగేంద్రరావుకు, సాయికిరణ్‌కు పోలీసులు మంగళవారం నోటీసులు ఇచ్చి నిర్బంధం చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

భీమడోలు: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, అమ్మేది ఎవడు, కొనేది ఎవడు అంటూ నినాదాలు చేస్తూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షించాలని కోరుతూ భీమడోలు జంక్షన్‌లో బుధవారం రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, టిడిపి నేతలు పి.యుగంధర్ ,శేషపు శేషగిరి, సిపిఎం నేత కట్టా భాస్కరరావు, రైతు సంఘం నాయకులు జి.ప్రసాదరావు మాట్లాడారు.

ముసునూరు : విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో ముసునూరు సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పిల్లి మురళీ, గంగులు సత్యనారాయణ, కంచర్ల దుర్గారావు, కంచర్ల శ్రీను, సిఐటియు నాయకులు పి.రత్నం, ఎ.నాగరాజు, వెంకటేశ్వరరావు, రెడ్డి తిరుపతిరావు పాల్గొన్నారు.

చింతలపూడి : విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఎఐటియుసి, సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవినేని రమేష్, నాగు, నక్కా తిరుపతిరావు, రాజుబోయిన వెంకటేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ ఎందరో ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును అమ్మడం హేయమైన చర్య అని అన్నారు.

నాయకత్వం వహించాల్సిన వైసిపి అడ్డుకోవడం సిగ్గుచేటు : సిపిఎం

ఏలూరు : విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు పోరాడుతున్న వారిపై నిర్బంధాలు వీడాలని, ప్రయివేటీకరణను అడ్డుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రాస్తారోకోలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ నిర్బంధాలు ప్రయోగించి, అక్రమ అరెస్టులు చేయడాన్ని రవి తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు జరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమానికి నాయకత్వం వహించి నడపాల్సిందిపోయి నిర్బంధానికి పూనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు బాబూరావు, జిల్లాలోని కొన్ని చోట్ల సిపిఎం నాయకులలతోపాటు పలు పార్టీల, ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేసిందన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశాఖలో 811 రోజులుగా కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా ట్రేడ్ యూనియన్లు, వామపక్షాలు, ప్రజా సంఘాలు బుధవారం రాస్తారోకోలకు పిలుపునిస్తే, దీనిని అడ్డుకొనేందుకు మంగళవారం రాత్రి నుండే వామపక్ష పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాల నాయకులను హౌస్‌అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు.

నేడు ఉమ్మడి జిల్లాలో చంద్రబాబు పర్యటన

ఉంగుటూరు: టిడిపి అధినేత చంద్రబాబు ఈ నెల నాలుగో తేదీ గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఉంగుటూరు, తాడేపల్లిగూడెం మండలాల్లో పర్యటించనున్నారు. అకాల వర్షాలకు ధాన్యం రైతులు పడుతున్న ఇబ్బందులు, పంట నష్టాలను ఆయన స్వయంగా పరిశీలించనున్నారు. ఆయన విజయవాడ నుంచి నేరుగా మధ్యాహ్నం 2.30 గంటలకు ఉంగుటూరు మండలం బాదంపూడిలోని కెనాల్ గట్టు రోడ్డుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 2.45కు తాడేపల్లిగూడెం మండలం నందమూరు చేరుకుని నాలుగు గంటలకు వరకూ పొలాలు, ధాన్యం పరిశీలించి రైతులతో మాట్లాడతారు. అనంతరం కోనసీమ జిల్లా రామచంద్రపురం బయల్దేరి వెళ్తారు.,,టిస్తారని టిడిపి నేత, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు తెలిపారు.

నేడు చినవెంకన్న కళ్యాణోత్సవం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్న వైశాఖమాస బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఈనెల నాలుగో తేదీన సాయంత్రం 7:30 గంటల శ్రీవారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అనివేటి మండపంలో కళ్యాణోత్సవ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో యాత్రికులు పెద్దఎత్తున పాల్గొనాలని ఆలయ ఇఒ వేంద్ర త్రినాథరావు తెలిపారు.

దేవాదాయ శాఖ అధికారి ఇంట్లో ఎసిబి సోదాలు

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

దేవాదాయ శాఖకు చెందిన ఉద్యోగి ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం ఉదయం సోదాలు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. వాసా నగేష్ విజయవాడ దుర్గ గుడిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇంతకుముందు ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఆ సమయంలోనూ అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం విజయవాడ దుర్గగుడిలో కూడా ఇదే తరహాలో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. ఆదాయానికి మించి ఆస్తులున్నాయనే కోణంలో అవినీతి నిరోధకశాఖ అధికారులు ద్వారకాతిరుమలలోని నగేష్‌కు చెందిన అపార్ట్‌మెంట్‌లో, విజయవాడ, నిడదవోలులోని బంధువుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీలను ఏలూరు డిఎస్‌పి టిఎస్ఆర్‌కె.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు సిఐ భాస్కర్ తెలిపారు.

కల్లాల్లో.. కన్నీరు..!

వరి రైతుల వేదన వర్ణనాతీతం
లారీలు, సంచుల్లేక అవస్థలు
ముక్క పేరుతో తారాస్థాయికి మిల్లర్ల దోపిడీ
వర్షాలకు తడిసి ముద్దవుతున్న ధాన్యం.. దిక్కుతోచని అన్నదాత
రెండు జిల్లాల్లోనూ దాదాపు 50 శాతం పంట కల్లాల్లోనే
కనీసం రైతులను పలుకరించని మంత్రులు, ఎంఎల్ఎలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతుల కంట కన్నీరొలుకుతోంది. కల్లాల్లో తడిసిన ధాన్యం చూసి అన్నదాత విలవిల్లాడిపోతున్నాడు. ఒకపక్క లారీలు లేక, మరోపక్క సంచులు అందక, చితుకు పేరుతో మిల్లర్ల దోపిడీ వంటి కష్టాలతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటనలు గుప్పిస్తున్నా లారీలు మాత్రం పంపకుండా నిలిపివేయడంతో రైతన్న పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రైతుల వేదన చూసిన వారంతా 'అయ్యో.. అన్నదాత' అనే పరిస్థితి ఏర్పడింది.

రంగు మారిన ధాన్యం

రబీ ధాన్యం కొనుగోలులో ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి సంబంధం లేకుండాపోయింది. రైతులు పడుతున్న కష్టాలను అధికారులు ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఉంది. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఏలూరు జిల్లాలో 3.90 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమలో 9.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటి వరకూ అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం చూస్తే 50 శాతం ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. కల్లాల్లో ఇంకా సగం పంట ఉండిపోయింది. గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటంతా తడిసి ముద్దవుతోంది. రాశులు చేసిన ధాన్యం కిందిభాగం పూర్తిగా తడిసిపోయి మొక్కలు వస్తుండగా, కోత దశలో ఉన్న పంట మాసూలు చేసేందుకు వీల్లేకుండా పోయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. వర్షం ఎప్పుడు పడుతుందో తెలీక నానాయాతన అనుభవిస్తున్నారు. బాగున్న ధాన్యం విక్రయించేందుకు ప్రయత్నించినా లారీలు, సంచులు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది.

వెంటాడుతున్న లారీలు, సంచుల సమస్య

జిల్లాలో ఆది నుంచి లారీలు, సంచుల సమస్య రైతులను వెంటాడుతోంది. ఏప్రిల్ 16న ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినా ఇప్పటికీ లారీలు, సంచుల సమస్య పరిష్కారం కాలేదు. రైతులే సొంతంగా సంచులు, లారీలు సమకూర్చుకోవాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో కిరాయి నిమిత్తం ఖర్చు తడిసి మోపెడవుతోంది. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం మంగళవారం లారీలను పూర్తిగా నిలిపివేసింది. మండలానికి ఒక్క లారీ రావడమే గగనంగా మారింది. ఉంగుటూరు, దెందులూరు వంటి మండలాల్లో సమస్య మరింత తీవ్రంగా ఉంది. పశ్చిమలోనూ పరిస్థితి ఇదేవిధంగా ఉంది. లారీలు, సంచులు రైతులకు అందించకపోవడంతో ధాన్యం కొనుగోలు సజావుగా సాగడం లేదు. మరోపక్క ధాన్యం మిల్లుకు పంపించిన తర్వాత ముక్కవుతుందంటూ పెద్దఎత్తున ధరలో కోత పెడుతున్న పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో పౌర సరఫరాలశాఖ అధికారులు ధాన్యం కొనుగోలులో పూర్తిగా నిర్లక్ష్య ధోరణి కనబరుస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. అధికారులు చెబుతున్న మాటలకు.. రైతులు పడుతున్న ఇబ్బందులకు పొంతన లేకుండాపోయింది. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు రైతుల్లో తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోంది. వర్షాలు వీడకపోవడంతో మొలకెత్తిన, తడిసిన ధాన్యం పరిస్థితి ఏమిటో రైతులకు అర్థం కాకుండాపోయింది.

ధాన్యం రాశిపై పరదాలు కప్పుతున్న రైతు

'మూడెకరాల ధాన్యం తడిసిపోయింది

జోగిరామారావు, అమ్మపాలెం, పెదవేగి మండలం

ఖరీఫ్ ధాన్యం కుప్పలు వేసి మాసూలు చేశాం. కురుస్తున్న వర్షాలకు మూడెకరాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యి మొలకలు వచ్చాయి. దీనిపై ఏం చేయాలో అర్థం కావడం లేదు. వర్షాలతో ధాన్యం ఆరబెట్టేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నా మంత్రులు, ఎంఎల్ఎలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం రైతులను పలుకరించకపోవడం గమనార్హం. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తే సమస్యలు తెలుస్తాయి. రైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది. అయితే ప్రకటనలకు మాత్రమే ప్రజాప్రతినిధులు పరిమితం కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లారీలు లేవు.. సంచులు ఇవ్వలేదు

సూరత్తుల శ్రీనివాస్, కాగుపాడు, ఉంగుటూరు మండలం

'18 ఎకరాల్లో వరిసాగు చేశాను. ఏప్రిల్ 12న మాసూలు చేశాను. సంచులు ఇవ్వకపోవడంతో సొంతంగా సమకూర్చుకోవాల్సి వచ్చింది. లారీలు రాకపోవడంతో సొంతంగా లారీ ఏర్పాటు చేసుకుని 467 సారలతో ఒకలోడు మిల్లుకు పంపించాం. ముక్కపేరుతో రూ.27 వేలు కోత వేస్తామంటున్నారు. ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది.'

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ బోధనాస్పత్రి ప్రాంగణంలోని రెడ్ క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 11 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా చిన్నారుల రక్తమార్పిడికి నెలకు సుమారు 150 యూనిట్ల రక్తం అవసరమవుతుందని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి తలసేమియా చిన్నారులను ఆదుకోవాలని కోరారు. మధ్యాహ్న సమయంలో చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు 30 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన ఏలూరు మానవత వైస్ ప్రెసిడెంట్ మానేపల్లి సునీత, సత్యనారాయణ దంపతులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్.ఆర్‌కె వరప్రసాదరావు, కడియాల కృష్ణారావు పాల్గొన్నారు.

7న కళోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి, మేడే వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల ఏడో తేదీన స్థానిక వైఎంహెచ్ఎ హాలులో కళోత్సవం నిర్వహిస్తున్నామని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, సిఐటియు, హేలాపురి సింగర్ అసోసియేషన్లు తెలిపాయి. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్ర కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, సిఐటియు ఏలూరు నగర కార్యదర్శి వి.సాయిబాబు హేలాపురి సింగర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రవి మాట్లాడారు. ఏడో తేదీ సాయంత్రం నాలుగు గంటల నుండి ఏడు గంటల వరకూ 99 మంది అల్లూరి సీతారామరాజు వేషధారణతో అల్లూరికి నివాళులర్పిస్తారని తెలిపారు. ప్రజా పాటలకు శాస్త్రీయ నృత్య నీరాజనం, కోలాట ప్రదర్శనలు, నృత్య రూపకాలు, మేడే పాటలు, వీడియో ప్రదర్శనలతో కళా సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులకు అల్లూరి సీతారామరాజు 125వ జయంత్యుత్సవ ప్రశంసాపత్రాలు, అల్లూరి జీవిత చరిత్ర పుస్తకాలు అందజేస్తామన్నారు. ఏలూరు పరిసర ప్రాంతాల వారు ఈ కళా సాంస్కృతిక ఉత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఏడో తేదీన నిర్వహించే సభకు విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహిస్తారని, ప్రధాన వక్తగా రచయిత కూనపరాజు కుమార్, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పెదపాటి రామకృష్ణ, హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, మానవతా ఏలూరు మండల ఛైర్మన్ అడుసుమిల్లి నిర్మల, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, సింగర్స్ అసోసియేషన్ నాయకులు వై.అర్జునరావు, ఏలూరులోని పలు కళాసంస్థల నృత్య శిక్షణా కేంద్రాల టీచర్లు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఆలపాటి నాగేశ్వరరావు, పి.కస్తూరిబాయి, పీడీ.రత్నాకర్‌రావు, వి.సురేష్, వై.అర్జున్‌రావు, ఎన్.గంగాభవాని, జి.శారద, ఎం.లక్ష్మి, ఉష, కె.లెనిన్‌బాబు, సూర్య ప్రకాష్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



తడిసిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న నాయకులు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పెదవేగి

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని, అకాల వర్షాలకు తడిసిన మొక్కజొన్నను కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అమ్మపాలెం, భోగాపురం, దుగ్గిరాల గ్రామాల్లో సిపిఎం, ఎపి రైతు సంఘం నాయకులు పర్యటించి తడిసిన మొక్కజొన్నను పరిశీలించారు. పంట నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని నినాదాలు చేస్తూ అమ్మపాలెంలోని మొక్కజొన్న కల్లాల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించి మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో పెదవేగి, లింగపాలెం, చింతలపూడి, కామవరపుకోట, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, చాట్రాయి, ముసునూరు తదితర మండలాల్లో వేలాది ఎకరాల్లో మొక్కజొన్న పంట కల్లాల్లో ఉండిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్ రూ.1962 కాగా వ్యాపారులు రూ.1600కే కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. వర్షాల నుండి పంటలను కాపాడుకునేందుకు సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం మండల కన్వీనర్ చందు సత్తిబాబు, మొక్కజొన్న రైతు మండపాక వెంకటేశ్వరావు, సిపిఎం నాయకులు పి.ఆదిశేషు, జె.గోపి, పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఉపాధి' పరిరక్షణ యాత్ర : వ్యకాస

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపాధి హామీ రక్షణకు ఈ నెల నాలుగో తేదీ నుండి తొమ్మిదో తేదీ వరకూ జరిగే యాత్రను జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం పిలుపునిచ్చారు. బుధవారం ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయటానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించిందనిన్నారు. ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటో విధానాన్ని రద్దు చేయాలని పాత పద్ధతిలో పే స్లిప్, సమ్మర్ అలవెన్స్, సైట్ సూపర్‌వైజర్లకు పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా చేపడుతున్న యాత్ర మండలంలోని ఎ.పోలవరంలో ప్రారంభమై కొయ్యలగూడెం, పోలవరం, బుట్టాయగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, టి.నరసాపురం, కామరపుకోట, ద్వారకాతిరుమల కలిపి మొత్తం పది మండలాల్లో, వంద గ్రామాల్లో 600 కిలోమీటర్లు సాగుతుందని తెలిపారు. ఈనెల పదో తేదీన ఆర్‌డిఒ కార్యాలయం వద్ద రెండు వేల మందితో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్మికులకు, ఉపాధి కూలీలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు జె.సూర్యచంద్రం, వై.సీత, ఎం.ఆనందరావు, బి.గంగరాజు, ఎస్.వెంకటేశ్వరరావు, జి.రాంబాబు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలి : కాంగ్రెస్

జంగారెడ్డిగూడెం : వర్షాలకు తడిసిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాధరావు ప్రభుత్వాన్ని కోరారు. వారంరోజులుగా కురుస్తున్న అకాలవర్షాలకు కారణంగా మెట్టప్రాంతం, నాగులగూడెం, పేరంపేట పరిసర ప్రాంతాల్లో పంట నష్టంపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాధరావు పరిశీలించారు. ఈ సందర్భంగా జెట్టి గురునాధరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ముఖ్యంగామెట్ట ప్రాంతంలో వరి, మొక్కజొన్న, వేరుశనగ, మామిడి, జీడిమామిడి, మిర్చి, కూరగాయలు, ఇతరపంటలు వర్షాల కారణంగా పంటలు పాడైపోయి రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. ధాన్యం తడవడం వల్ల మొలక వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. కొన్నిచోట్ల ధాన్యం మొలకలు వచ్చాయని, తడిసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్ల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. గతంలో అకాల వర్షాలకు రైతులు నష్టపోకుండా రైతులకు ప్రభుత్వం టార్పాలిన్‌లను సబ్సిడీపై సరఫరా చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం రైతులకు సబ్సిడీగా వ్యవసాయ పరికరాలు ఇవ్వడం నిలిపివేసిందన్నారు. ఆర్‌బికెల ద్వారా గోనె సంచులు కూడా ఇవ్వడం లేదన్నారు. పంట నష్టం సర్వే చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు విస్తరణ పనులు.. ప్రజల పాట్లు

పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో జరుగుతున్న 165 పామర్రు-దిగమర్రు జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా ప్రజలు, వాహనచోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలో 14 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. మండలంలోని పెదపాలపర్రు నుంచి దాకరం వరకు జరిగే రోడ్డు విస్తరణ పనుల వల్ల గత ఆరు నెలలుగా వాహనదారులు, ప్రజలు అనేక ఆగచాట్లు పడాల్సి వస్తోంది. ముదినేపల్లి ఊరు వెలువల గుడివాడ, కైకలూరు రోడ్ల వైపు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ముదినేపల్లి ప్రధాన సెంటర్‌లో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులు మధ్యలో కంట్రాక్టర్ వదిలివేశాడు. దీంతో ముదినేపల్లి సెంటర్‌లో ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు.

నీటితో నిండిన డ్రెయినేజీ గుంత

అసంపూర్తిగా డ్రెయినేజీ నిర్మాణం

ముదినేపల్లి సెంటర్‌లో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గత నవంబర్ మూడో తేదీన కాంట్రాక్టర్ పాత డ్రెయిన్లు పూడ్చివేసి వాటి స్థానంలో కొత్త డ్రెయిన్ల నిర్మాణ పనులు ప్రారంభించాడు. ఆ పనులను అసంపూర్తిగా వదిలేయడంతో అకాల వర్షాలకు మురుగునీరు పారుదల లేక ఇటు ప్రజలు, అటు వ్యాపారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

రోడ్లపై దుర్వాసన

ముదినేపల్లి సెంటర్‌లో కొత్త డ్రెయిన్లు నిర్మించేందుకు సదరు కాంట్రాక్టర్ ఉత్తర, దక్షిణ వైపు ఉన్న రెండు పాత డ్రెయిన్లను బండరాళ్లతో పూడ్చివేయడంతో వర్షపునీరు పారుదల లేక రోజుల తరబడి రోడ్లపైనే నిలిచి ఉంటుంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. గ్రామంలో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు విషజ్వరాలు బారిన పడుతున్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు పారుదల లేక ముదినేపల్లి మురుగెత్తిపోతోంది.

వాహనదారుల తిప్పలు

ముదినేపల్లి సెంటర్‌లో అస్తవ్యస్తంగా, అసంపూర్తిగా చేసిన డ్రెయినేజీ నిర్మాణ పనుల వల్ల వాహనదారులు, దుకాణదారులు, బాటసారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బస్టాండ్, ఎస్‌బిఐ, ఆర్‌సిఎం చర్చి, దుకాణాల ఎదుట చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులు మధ్యలో వదిలేశారు. పనులు ఆపి ఆరు నెలలైనా తిరిగి ప్రారంభించలేదు. దీంతో అకాల వర్షాలకు డ్రెయిన్ల నిర్మాణం కోసం తవ్విన గుంతల్లో వర్షపు నీరు నెలల తరబడి నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, విద్యార్థులు, దుకాణదారులు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అకాలవర్షాల కారణంగా గుంతలు తవ్విన ప్రాంతమంతా బురదకయ్యగా మారింది. దీంతో కాలు జారి గుంతల్లో పడే ప్రమాదం ఉందని ప్రజలు భయందోళనకు గురవుతున్నారు.

నరకప్రాయంగా ప్రయాణం

రహదారి విస్తరణ పనుల కారణంగా ముదినేపల్లి నుంచి గుడివాడ వెళ్లే రోడ్డు నరకప్రాయంగా మారింది. నిత్యం ఈ రోడ్డుపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దీంతో రోడ్డు అసాంతం గుంతలమయమై నరకంగా మారింది. దీనికి తోడు రోడ్డు మార్జిన్లల్లో కూడా గుంతలు ఏర్పాడడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ వద్ద రోడ్డు మార్జిన్లల్లో ఏర్పడ్డ గుంతలు ప్రమాదకరంగా మారాయి. దీంతో రెండు వాహనాలు ఎదురెదురుగా తప్పుకునే అవకాశం లేదు. వాహనం రోడ్డు మార్జిన్ దిగితే రోడెక్కే పరిస్థితి లేదు. దీంతో వాహనాలు దెబ్బతినడంతో పాటు తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పలుసార్లు రోడ్డు మార్జిన్లల్లో దిగి వాహనాలు పల్టీ కొట్టిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి ముదినేపల్లి సెంటర్‌లో అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీ నిర్మాణ పనులు పూర్తి చేసి ముదినేపల్లి గ్రామస్తులు పడుతున్న మురుగు నీటి పారుదల ఇబ్బందులు తీర్చడంతో పాటు ప్రాణాపాయంగా ఉన్న ముదినేపల్లి-గుడివాడ రోడ్డు మరమ్మతులు పనులు చేపట్టి ప్రజలు ప్రాణాలు కాపాడాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ముదినేపల్లి రోడ్డుపై నిలిచిన మురుగునీరు

రామారావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కమ్యూనిస్టు కార్యకర్త, శతాధిక వృద్ధుడు విశాలాంధ్ర రాముగా పిలిచే తాన్న రామారావు మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ బుధవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. తాన్న రామారావు ఊహ తెలిసినప్పటి నుంచి కమ్యూనిస్టు రాజకీయాల్లో మమేకమై పనిచేశారని తెలిపారు. పేదలు, కష్టజీవుల కోసం సిపిఐ నడిపిన ఉద్యమంలో భాగస్వామిగా ఉండేవారని కొనియాడారు. 30 సంవత్సరాలు సుదీర్ఘకాలం విశాలాంధ్ర ఏజెంట్‌గా పేపర్ పంపిణీ చేయడంతో ఆయన విశాలాంధ్ర రాముగా పిలవబడేవారని తెలిపారు. వృద్ధాప్యం కారణంగా హైదరాబాదులో వైద్య సహాయం కోసం తన నివాసాన్ని మార్చారన్నారు. అనంతరం సిఆర్ ఫౌండేషన్ ఆశ్రమంలో భార్యతో కలిసి ఉన్నారని తెలిపారు. సంవత్సరం క్రితం ఫౌండేషన్ నుంచి వచ్చి ఏలూరులో నివాసం ఉంటూ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. వందేళ్ల ఆయన జీవితం నిబద్ధత, నిజాయితీతో సాగిందన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సిపిఐ కార్యాలయ కార్యదర్శిగా సేవలందించారని గుర్తు చేసుకున్నారు. విశాలాంధ్ర రాము మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేటి నుంచి సోమేశ్వర కళ్యాణ మహోత్సవాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అల్లూరులో ఉన్న శ్రీపార్వతీ సమేత సోమేశ్వరస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఈ నెల నాలుగో తేదీ గురువారం నుంచి ఆరో తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ జి.సుధారాణి, ఆలయ కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగో తేదీ ఉదయం స్వామివారిని, అమ్మవారిని పెండ్లికుమారుని, పెండ్లికుమార్తెగా అలంకరించడం, ఐదో తేదీ రాత్రి స్వామివారి దివ్యకళ్యాణం, ఆరో తేదీ ఉదయం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన, రాత్రి పవళింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాలకు విచ్చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కాగుపాడులో వర్షాలకు తడిసి మొక్క వచ్చిన ధాన్యం రాశులను మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ తడిచి మొక్క వచ్చిన ధాన్యాన్ని మద్దతు ధరకు వెంటనే కొనాలని డిమాండ్ చేశారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి రైతులకు ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఆయనతో పాటు టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కడియాల రవిశంకర్, ఇమ్మని గంగాధరరావు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇంటి పైకప్పు

బాధితురాలికి సాయం

ప్రజాశక్తి - పోలవరం

అకాల వర్షాలకు మండలంలోని పట్టిసీమ గ్రామంలో కోలా లక్ష్మీకాంతం ఇంటి పైకప్పు కూలిపోయినది. విషయం తెలుసుకున్న జెడ్‌పిటిసి సభ్యులు కలుం హేమకుమారి, పట్టిసీమ పంచాయతీ సర్పంచి సబ్బారపు శ్రీరామ్మూర్తితో కలిసి పోలవరం తహాశీల్దార్ బి.సుమతి బాధితురాలు లక్ష్మీకాంతంను బుధవారం పరామర్శించి 25 కేజీల బియ్యం అందించారు. కోలా లక్ష్మీకాంతానికి గ్రామీణ్ పథకంలో ఇల్లు మంజూరైందని, ఆర్థిక స్తోమత లేక కట్టుకోలేదని, ఇప్పుడు నిర్మించుకుంటానని కోలా లక్ష్మీకాంతం తెలిపారని తహాశీల్దార్ బి.సుమతి తెలిపారు.

ఘనంగా వెంకటేశ్వర బ్రహ్మోత్సవం

ప్రజాశక్తి - కైకలూరు

భూ సమేత వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవం సుదర్శన హోమంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు. తొలుత ఆలయ అర్చకులు, ధర్మ కర్తమండలి పూర్ణకుంభంతో ఎంఎల్ఎ దంపతులకు స్వాగతం పలికారు. శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వారితో పాటు ఎంపిపి అడవి వెంకటకృష్ణమోహన్, వైసిపి మండల అధ్యక్షులు బత్రాజు శివాజీ, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, ఆలయ ఛైర్మన్ బొప్పన శివకుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు పంజా రామారావు, పెంచికలమర్రు సర్పంచి జయమంగళ కాసులు, జక్కా శివాజీ ఉన్నారు.

మండలంలోని గోపవరంలో జరుగుతున్న సంతాన వేణుగోపాల స్వామి కళ్యాణోత్సవంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకటకృష్ణమోహన్, సర్పంచి ఉలిసి వసంత కుమారి, పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

ముదినేపల్లి :అధికార పార్టీ అహంకారంతో సుందరయ్య విజ్ఞాన కేంద్రాన్ని, సిపిఎం స్తూపాన్ని తొలగించాలని ప్రయత్నిస్తున్న మండలంలోని దేవపూడికి చెందిన ఉల్లంకి నగేష్ చేస్తున్న ఆగడాలపై సిపిఎం సీనియర్ నాయకులు ఉల్లంకి నాంచారయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం ఆయన దేవపూడిలో విలేకరులతో మాట్లాడారు. దేవపూడి పంటకాలువ వెంబడి పోరంబోకు భూమి సెంటున్నరలో 47 ఏళ్లుగా తాను నివసిస్తున్నానన్నారు. ఇటీవల ఆ స్థలంలో సిపిఎం స్తూపంతో పాటు భవనం నిర్మించామని తెలిపారు. భవనం కింద భాగంలో రెండు దుకాణాలు, పైభాగంలో సుందరయ్య విజ్ఞానకేంద్రం ఏర్పాటు చేశామన్నారు. దేవపూడికి చెందిన ఉల్లంకి నగేష్, పాలడుగు సురేంద్ర అనుమతులు లేకుండా గ్రామంలో అక్రమంగా చెరువులు తవ్వి అటు పంట కాలువలను, ఇటు వ్యవసాయ భూములను నాశనం చేస్తున్నారని, అనేకసార్లు నగేష్‌కు చెప్పినప్పటికీ వినలేదని వివరించారు. దీంతో రెండు పంటలు పండే వ్యవసాయ భూములు పాడైపోతాయని, కాల్వలు దెబ్బతింటాయని, తాగునీటి చెరువులు కలుషితమవుతాయని రైతులు, ప్రజలు సంతకాల సేకరణ చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేశామనే కక్షతో సుందరయ్య విజ్ఞాన కేంద్రం, సిపిఎం స్తూపాన్ని తొలగించాలని. భవనానికి విద్యుత్ సౌకర్యం తొలగించాలని నగేష్ అతని అనుచరులు అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది గ్రామ దళిత ఎంపిటిసి సభ్యులు గుమ్మడి వెంకటేశ్వరరావు, అక్రమ చెరువులు తవ్వాడని ప్రశ్నించినందకు, తవ్వకాలకు అడ్డుపడినందుకు ఎంపిటిసిపై నగేష్, అతని అనుచరులు దాడి చేశారని వివరించారు.

నేరాలు - ఘోరాలు

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కుటుంబ సభ్యులు మందలించారని మనస్తాపానికి గురైన యువకుడు కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం పి.రాజవరం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన యువకుడు చిన్నంశెట్టి నాగశివాజీ చెప్పిన మాట వినడం లేదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన నాగశివాజీ కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని కుటుంబసభ్యులు హుటాహుటిన జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం 108లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

ఫోక్సో కేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - టి.నరసాపురం

పోక్సో కేసులో ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన వ్యక్తి ప్రేమిస్తున్నానని వెంటపడి ఏప్రిల్ 29వ తేదీన కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడని ఆ వ్యక్తితో పాటు అతనికి సహకరించిన నలుగురు వ్యక్తులపై బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ఐదుగురిపై గత నెల 30వ తేదీన పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఐదుగురిని దర్యాప్తు అధికారి నూజివీడు డిఎస్‌పి ఇ.అశోక్‌కుమార్‌గౌడ్ అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. బాలికను తీసుకువెళ్లడానికి ఉపయోగించిన మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మాట్లాడుతున్న విజయకుమార్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మహిళలు స్వయం సంమృద్ధి సాధించాలని ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ఎపి ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలి అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్ తెలిపారు. మండలంలోని మక్కినవారిగూడెంలో తపన ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి లబ్ధిదారులకు పిఎంఇజిపి పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన వారికి ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు మాలంపాటి హరిబాబు, గడా శ్రీధర్, పాపోలు చంద్రశేఖర్ పలువురు మహిళలు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

చింతలపూడి:చింతలపూడి కోర్టులో ఈ నెల 13వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని చింతలపూడి జూనియర్ సివిల్ న్యాయమూర్తి సి.మధుబాబు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడే క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, బ్యాంక్ కేసులు, సివిల్ తగాదాలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రతిరోజు చింతలపూడి కోర్టులో ప్రి లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహించి కేసులు రాజీ చేస్తున్నారని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లపై కక్షిదారులకు ఎక్కువ ప్రచారం కల్పించి వారి వంతు కృషి చేయాలన్నారు. సివిల్ తగాదాల్లో కోర్టుకు కట్టిన ఫీజు తిరిగి తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. రాజీయే రాజ మార్గమన్నారు. రాజీ పడడం వల్ల ఇరు గ్రూపులు గెలిచినట్లేనన్నారు.

ఏలూరు జ్యూట్‌కార్మికులకు న్యాయం చేయాలని వినతి

ఏలూరు అర్బన్:ఏలూరు జ్యూట్ మిల్లు కార్మికులకు న్యాయమైన, మెరుగైన పరిష్కారం చేయకుండా తాత్సారం చేస్తున్న యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఐదు కార్మిక సంఘాల నాయకులు జెసిఎల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జెసిఎల్ ఎ.రాణి స్పందిస్తూ ఈ విషయమై వెంటనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈనెల 12న ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. వినతిని ఇచ్చినవారిలో ఐఎఫ్‌టియు నాయకులు యు.వెంకటేశ్వరరావు, టిఎన్‌టియుసి నాయకులు ఉమాశంకర్, సిఐటియు నాయకులు బి.జగన్నాథరావు, ఐఎన్‌టియుసి నాయకులు పులి శ్రీరాములు, ఎఐటియుసి నాయకులు బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపిపిల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీలక్ష్మి

ఉంగుటూరు:ఎంపిపిల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఏలూరులో జరిగిన కార్యక్రమంలో ఆమెను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సహచర ఎంపిపిలు అభినందించారు.

శ్రీలక్ష్మిని అభినందిస్తున్న ప్రతినిధులు

రైతుల సమస్యలు పరిష్కారంలో విఫలం

భీమడోలు:ధాన్యం రైతులకు సరిపడా గోనెసంచులు సరఫరాలో, రవాణా సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు విమర్శించారు. ఆయన బుధవారం సాయంత్రం భీమడోలులో పర్యటించారు. ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

డిఎస్‌పి లతాకుమారి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం డిఎస్‌పిగా సబ్ డివిజన్ పరిధిలో కె.లతాకుమారి సేవలు మరువలేనివని పలువురు అన్నారు. పోలవరం డిఎస్‌పిగా బాధ్యతలు నిర్వహించి పెద్దాపురం డిఎస్‌పిగా బదిలీపై వెళ్తున్న కె.లతాకుమారికి పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం స్థానిక రివర్ ఇన్‌లో బుధశారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్‌లోని సిఐలు, ఎస్ఐలు, నాయకులు, సర్పంచులు, పోలీస్ సిబ్బంది, ప్రజలు డిఎస్‌పి లతాకుమారికి శాలువలు కప్పి ఘనంగా సన్మానించి ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కరోనా, వరదలు, మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో డిఎస్‌పి లతాకుమారి ప్రజలకు ఎనలేని సేవలందిం చారన్నారు. గిరి నేస్తం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పుస్తకాలను అందించి ప్రోత్సహించి వారికి అన్ని విధాలా సహకారాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంపిపి సంఘం అధ్యక్షులు మేకల హనుమంతరావు, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు బుగ్గ మురళీకృష్ణ, పంచాయతీ సర్పంచి పొడుం పుష్ప, సొసైటీ అధ్యక్షులు పాదం రాజబాబు, ఐటిడిఎస్ సేవ సంస్థ డైరెక్టర్ జి.అనిల్‌కుమార్, పోలవరం ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్ సొబ్బన రాజశేఖర్‌బాబు, క్లబ్ సభ్యులు, ఉపసర్పంచి కొరసిక శ్రీనివాస్, పొడుం శ్యాంకుమార్ పాల్గొన్నారు.


డిఎస్‌పి లతాకుమారిని సత్కరిస్తున్న వక్తలు

బాలునికి ఉచిత శస్త్రచికిత్స

సాయి హాస్పిటల్ యాజమాన్యానికి ఎంఎల్‌ఎ బాలరాజు అభినందనలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గుండెలో రంధ్రం ఉన్న ఆరేళ్ల బాలునికి ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు సూచన మేరకు సాయి హాస్పిటల్ వారు శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం బాలుడు ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. మండలంలోని బెడదనూరుకు చెందిన పాయం దుర్గారావు కుమారుడు హర్షవర్ధన్ గుండెలో రంధ్రం ఉన్నట్లు ఎంఎల్‌ఎ బాలరాజు ఆధ్వర్యంలో బుట్టాయగూడెం జూనియర్ కళాశాలలో సాయి హాస్పిటల్ వారు ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో గుర్తించారు. ఈ క్రమంలో ఎంఎల్‌ఎ బాలరాజు సూచనల మేరకు సాయి హాస్పిటల్‌లో బాలునికి ఉచితంగా శస్త్ర చికిత్స చేశారు. బాలుడు ప్రస్తుతం ఆసుపత్రి లో కోలుకుంటున్నాడు. తాను కోరిన వెంటనే బాలుడికి చికిత్స అందించిన సాయి హాస్పిటల్ యాజమాన్యానికి, ఎండి డాక్టర్ విజయకుమార్‌కి, గుండె వైద్య నిపుణులు శరత్ చంద్రకు ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు కృతజ్ఞతలు తెలిపారు. తమ బాలుడు పట్ల శ్రద్ధ వహించి నిరంతరం వైద్యులతో మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందేలా చేసి తమ బిడ్డ ప్రాణాలు నిలిపినందుకు బాలుడి తల్లిదండ్రులు ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజుకు, హాస్పిటల్ యాజమాన్యానికి, డాక్టర్లకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతున్న బాలుడు

మేడే జెండా తొలగింపు దుర్మార్గం : సిఐటియు

మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన

ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో సిఐటియు ఆధ్వర్యంలో ఎగుర వేసిన మేడే జెండాను తొలగించడం దుర్మార్గమైన చర్య అని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సుభాషిణి అన్నారు. ఈ మేరకు బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లడుతూ మే డే సందర్భంగా కార్యాలయం ఎదుట ఉన్న సిఐటియు జెండాను తొలగించిన మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలపై దృష్టిసారించని కమిషనర్ కార్మికుల ఐక్యతను దెబ్బకొట్టే చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జెండాను తిరిగి నెలకొల్పాలన్నారు. ఓ దశలో మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన కమిషనర్ భవానీప్రసాద్ కారును కార్మికులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి వివాదాన్ని అడ్డుకున్నారు. జెండాను తిరిగి ఏర్పాటు చేయాలని కమిషనర్‌ని అడగ్గా మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేసిన తరువాత చెబుతామని బదులిచ్చారు. దీనిపై అసంతృప్తి చెందిన పారిశుధ్య కార్మికులు జెండా తొలగింపునకు పాలకవర్గ తీర్మానం ఆమోదించారా అంటూ ప్రశ్నించారు. జెండా తిరిగి ఏర్పాటు చేసే వరకూ విధులకు హాజరుకాబోమని తేల్చి చెప్పారు. సిఐటియు మనుగడ కోసం సమ్మె ప్రకటిస్తామని కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు పసల సూర్యారావు, పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

HON'RABLE PRINCIPAL FAMILY COURT CUM IV ADDL DISRICT JUDGE VIJAYAWADA

M.C. NO. 100/2019

Between:
1. తలకాయల విజయకుమారి
2. తలకాయల డినయిస్సీ దర్శని
Being minor, Rep. by mother, 1st petitioner
... Petitioners

AND

తలకాయల రాజశేఖర్, తండ్రి. జ్ఞానప్రసాద్, CRPF Constiable, R/o హౌసింగ్ బోర్డు కాలనీ, ఎల్.ఐ.జి: 1-214, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా.
.... Respondent

పై నెంబరు పిటిషన్‌లో 1వ పిటిషనరుకు రూ.10,000లు, 2వ పిటిషనరుకు రూ.6,000లు మనోవర్తి కోరుతూ పిటిషన్‌లో గౌరవ పై కోర్టులో మీ యొక్క హాజరు నిమిత్తం నోటీసులు మీ అడ్రసుకు అనేక పర్యాయములు పై గౌరవ కోర్టు ద్వారాను, రిజిష్టర్డు పోస్టు ద్వారాను పంపిననూ వాటిని మీరు అందుకొని యుండలేదు. అందువలన మీరు ది.16-05-2023వ తేదీ ఉదయం గం.10.30 ని.లకు స్వయముగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై గౌరవ పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. అట్లు మీరు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు మనోవర్తి పిటిషన్‌ను తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

/// BY COURT ORDER ///

తలకాయల విజయకుమారి
విజయవాడ పిటిషనరు,
ది.03-05-2023 విజయవాడ

తణుకు పురపాలక సంఘం

టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం. ODW/01/85/2023/ఇ1 తేది.02-05-2023

తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ దిగువ తెల్పిన పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

		ఇ.సి.వి. (రూ. లక్షలలో)
1. బిల్డింగ్ పనులు	2 నెం.లు	38.52
2. డ్రెయిను పనులు	2 నెం.లు	12.55

సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 04-05-2023వ తేదీ నుండి చూడవచ్చును.

సం/- కమిషనరు
తణుకు పురపాలక సంఘం

దస్తావేజు పోయినది

ప.గో॥జిల్లా, భీమవరం మండలం, కొవ్వాడ పుంత రోడ్, డో.నెం. 7-180, బైపాస్ రోడ్ గ్రామ కాపురస్తులు లేటు మహ్మద్ సుల్తాన్ షరీఫ్ గారి కుమారుడు మహ్మద్ ఆసిఫ్ పాషా అను నాకు చెందిన ది.06-04-2006 సం॥రం తేదీన భీమవరం సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిష్టర్ కాబడిన దస్తావేజు నెం. 2172/2006 గా రిజిష్టరు కాబడినది. ఈ ఒరిజినల్ దస్తావేజు సంచిలో పెట్టుకొని ది.11-04-2023వ తేదీన మా ఇంటి నుండి భీమవరం 1వ పట్టణంలో గల జిరాక్సు సెంటర్ నందు జిరాక్సు తీయించుకొనుటకు మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా మార్గ మధ్యలో అనగా భీమవరం 1వ పట్టణం పరిధిలో ఓల్డ్ వెంకట్రామా థియేటర్ సమీపంలో సంచి జారి పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది వారికి అందజేయవలసినదిగా కోరుచున్నాను.

మహ్మద్ ఆసిఫ్ పాషా
తండ్రి: సుల్తాన్ షరీఫ్, కొవ్వాడ పుంత,
సెల్: 98497 33477

నేడు సీజ్డ్ వాహనాల వేలం

టి.నరసాపురం:ఎక్సైజ్ కేసులో పట్టుబడిన వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. ఎస్‌పి మేరీప్రశాంతి ఆదేశాల మేరకు ఈ నెల నాలుగో తేదీన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎపి ఎక్సైజ్ యాక్ట్ కేసుల్లో పట్టుబడిన 17 మోటర్ సైకిళ్లు, ఒక కారుకు ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీలుగుమిల్లి వారి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బహిరంగంగా వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ.ఐదు వేలు డిపాజిట్, ఆధార్, పాన్ కార్డు తప్పనిసరిగా సమర్పించాలన్నారు.

పేరు మార్పు

కోలాటి సోమేశ్వరరాజు (కొత్త పేరు), తండ్రి: కోలాటి ఆంజనేయులు (కొత్త పేరు), గతంలో నా పేరు కోరాటి సోమేశ్వరరాజు (పాత పేరు), తండ్రి: కోరాటి ఆంజనేయులు (పాత పేరు), డోర్ నెం. 5-77/1, మల్లిపూడి గ్రామం, పెనుమంట్ర మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివసించుచున్నాను. ఇప్పుడు నా పేరును **కోరాటి సోమేశ్వరరాజు (పాత పేరు), తండ్రి: కోరాటి ఆంజనేయులు (పాత పేరు) నుండి కోలాటి సోమేశ్వరరాజు (కొత్త పేరు), తండ్రి: కోలాటి ఆంజనేయులు (కొత్త పేరు)** మరియు నా తల్లి పేరు **కోరాటి మాణిక్యమ్మ (పాత పేరు) నుండి కోలాటి మాణిక్యమ్మ (కొత్త పేరు)గా** మార్చుకున్నాను. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్త పేరును ఉపయోగించవలెను.

సెల్: 9346496939

పాస్‌పోర్టు పోయినది

యలమంచిలి మండలం, నేరేడుమిల్లి గ్రామంకు చెందిన పెచ్చెట్టి ధనశ్రీరామ్, తండ్రి: వెంకటేశ్వర్లు (ఆధార్ నెంబర్ 952986825845) తెలియ జేయునది ఏమనగా ది. 20-4-2023న నా ఒరిజినల్ పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీసుకునే నిమిత్తం మోటార్ సైకిల్‌పై అడవిపాలెం వెళు తుండగా నా పాస్‌పోర్టు, ఇతర డాక్యుమెంట్స్ ఉన్న సంచి దారిలో పడిపోయినవి. దారి పొడవునా ఎంత వెతికినా కనిపించలేదు. నా ఒరిజినల్ పాస్‌పోర్టు (నేను వైజాగ్‌లో ది.17-8-2017న పొందిన ఒరిజినల్ పాస్‌పోర్టు (R 2800681), ఇతర డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికితే నాకు ఈ నెంబర్‌కు తెలియపరచగలరు.

పెచ్చెట్టి ధన శ్రీరామ్
డోర్ నెం. 3-46, అడవిపాలెం
యలమంచిలి మండలం
సెల్: 7995393858

మహారాజశ్రీ స్పెషల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో

C.C. No. 183/2021

ఫిర్యాది: గూడూరి వెంకట సూర్య రామకృష్ణ
మరియు
ముద్దాయి: పెద్దిరెడ్డి నాగరాజు

నిందితుడు హాజరు నిమిత్తం సెక్షన్ 82 సి.ఆర్.పి.సి. ప్రకారం వేయించిన ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, పై నెంబర్ గ్రంథములో ముద్దాయి పెద్దిరెడ్డి నాగరాజు, తండ్రి: దేవేంద్రారావు, నివాసం: డోర్ నెం. 3-219/4, షాప్ నెం. 4, శ్రీ సాయి అంబికా టవర్స్, నియర్ పెట్రోల్ బంక్, కె.సావరం, ఉండ్రాజవరం మండలం, పూర్వం పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా వారికి ఎన్.బి.డబ్ల్యు వారెంటు జారీ కాబడి పై నెంబరు కేసులో ఎన్.ఐ. యాక్టు సెక్షన్ 138 క్రింద కేసు నెం. 183/2021 కేసులో నేరానికి పాల్పడినట్లు (లేదా నేరానికి పాల్పడినట్లు అనుమానించ బడినారని) శ్రీ కోర్టు వారి ఎదుట ఫిర్యాదు చేయబడినది. మీపై అరెస్టు వారెంటు జారీచేయుటకు దారి తీసినది. సదరు వారంటు అమలు జరుపుటకు మీరు పరారీలో ఉన్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై **ది. 05-6-2023 సం॥రం తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.00 లకు** స్వయంగా గాని, ప్లీడరు ద్వారాగా గాని హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

ఫిర్యాది తరుపు అడ్వకేట్
G.N.V.S.CH.Y.PRASAD
తణుకు Advocate, Tanuku
తేది:02-05-23 Cell: 7799235999

మహారాజశ్రీ స్పెషల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో

C.C. No. 229/2019

ఫిర్యాది: నల్లీ తిరుమల నాగ సాయి పవన్ మణికంఠ
మరియు
ముద్దాయి: ఆవిడి సుబ్రహ్మణ్యం

నిందితుడు హాజరు నిమిత్తం సెక్షన్ 82 సి.ఆర్.పి.సి. ప్రకారం వేయించిన ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, పై నెంబర్ గ్రంథములో ముద్దాయి ఆవిడి సుబ్రహ్మణ్యం, తండ్రి: వెంకటరావు, నివాసం: ప్లాట్ నెం. 502, అవినాష్ రెసిడెన్సీ, పాతూరు, తణుకు మండలము, పశ్చిమగోదావరి జిల్లా వారికి సమన్స్, నోటీసు జారీ కాబడి పై నెంబరు కేసులో ఎన్.ఐ. యాక్టు సెక్షన్ 138 క్రింద కేసు నెం. 229/2019 కేసులో నేరానికి పాల్పడినట్లు (లేదా నేరానికి పాల్పడినట్లు అనుమానించబడినారని) శ్రీ కోర్టు వారి ఎదుట ఫిర్యాదు చేయబడినది. మీ పై సమన్స్, నోటీసులు జారీ చేయుటకు దారి తీసినది. సదరు సమన్స్, నోటీసులు అమలు జరుపుటకు మీరు పరారీలో ఉన్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై **ది. 11-5-2023 సం॥రం తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.00 లకు** స్వయంగా గాని, ప్లీడరు ద్వారాగా గాని హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

ఫిర్యాది తరుపు అడ్వకేట్
G.N.V.S.CH.Y.PRASAD
తణుకు Advocate, Tanuku
తేది:02-05-23 Cell: 7799235999

మహారాజశ్రీ స్పెషల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో

C.C. No. 474/2021

ఫిర్యాది: దువ్వపు బాలాజి
మరియు
ముద్దాయి: గురజరాపు నాగ వెంకట సత్యనారాయణ

నిందితుడు హాజరు నిమిత్తం సెక్షన్ 82 సి.ఆర్.పి.సి. ప్రకారం వేయించిన ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, పై నెంబర్ గ్రంథములో ముద్దాయి గురజరాపు నాగ వెంకట సత్యనారాయణ, తండ్రి: సత్యనారాయణ, నివాసం: డోర్ నెం. 1-18, మండపాక గ్రామము, తణుకు మండలము, పశ్చిమగోదావరి జిల్లా వారికి ఎన్.బి.డబ్ల్యు వారెంటు జారీ కాబడి పై నెంబరు కేసులో ఎన్.ఐ. యాక్టు సెక్షన్ 138 క్రింద కేసు నెం. 474/2021 కేసులో నేరానికి పాల్పడినట్లు (లేదా నేరానికి పాల్పడినట్లు అనుమానించబడినారని) శ్రీ కోర్టు వారి ఎదుట ఫిర్యాదు చేయబడినది. మీ పై సమన్స్, నోటీసులు జారీ చేయుటకు దారి తీసినది. సదరు సమన్స్, నోటీసులు అమలు జరుపుటకు మీరు పరారీలో ఉన్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై **ది. 11-5-2023 సం॥రం తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.00 లకు** స్వయంగా గాని, ప్లీడరు ద్వారాగా గాని హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

ఫిర్యాది తరుపు అడ్వకేట్
G.N.V.S.CH.Y.PRASAD
తణుకు Advocate, Tanuku
తేది:02-05-23 Cell: 7799235999